31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం 19 ఫిబ్రవరి 2026 పేజీలు : 8

### పదవ తరగతి ఫలితాల్లో

## 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

**జగిత్యాల అదనపు కలెక్టర్ బిఎస్.లత.**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 18 :** పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత అన్నారు. పదో పరీక్షల బి సన్నద్ధతకై జిల్లా అధికారుల సమన్వయ సమావేశం బుధవారం రోజున కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత ఆధ్వర్యంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బిఎస్.లత మాట్లాడుతూ రాబోయే పదో పరీక్షల కోసం అన్ని -2లో

### ఇందిరమ్మ ఇండ్లను

## గృహప్రవేశాలకు రెడీ చేయండి



**-మార్చి 31 వరకు నిర్మాణ పనులన్నీ పూర్తి చేయండి..**
**-ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించండి..**
**-ఇసుక ఇటుక సిమెంటు కొంత చవకగా లభించేలా అధికారులు దృష్టి సారించాలి..**
**-కరీంనగర్ జిల్లాలో వేగంగా ఇండ్ల నిర్మాణం..**
**-ప్రోగ్రెస్ చాలా బాగుంది..**
**-రాష్ట్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి గౌతమ్..**
**-కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి అలుగునూరు, కోతి రాంపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన**

చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 18 : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మొదటి దశలో ప్రారంభించిన పనులన్నింటినీ మార్చి 31 లోగా పూర్తిచేసుకునేలా చూడాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులు సంబురంగా గృహప్రవేశాలు జరుపుకునేలా ఇండ్లను రెడీ చేసి ఇవ్వాలని సూచించారు.బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 2లో

### 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో

## కీలకంగా లైఫ్ సైన్సెస్




**దేశ జీడీపీలో మన వాటాను 10 శాతానికి పెంచేందుకే "తెలంగాణ రైజింగ్ 2047"కు శ్రీకారం**
**బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 18 : తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం -2లో



# రంజాన్ మాసం వరాల వసంతం

**నేటి నుండి రంజాన్ ఉపవాస దీక్షలు**

చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి18 : ముస్లింల పవిత్ర మాంసం రంజాన్ గురువారం నుండి ప్రారంభం కానుంది. ఈ నెలలో ముస్లింలు ఉపవాస దీక్షలు పాటు ఉండడం మరియు బీదలకు దానాలు ధర్మాలు చేయడం ఆనవాయిది.పవిత్ర రమజాన్ అత్యంత శుభప్రదమైన మాసం శుభాల సిరులు వర్షంచే వరాల వసంతం. ఈ మాసంలోనే పవిత్ర అంతిము దివ్య ఖుర్ఆన్ అవతరించింది. ఇది సమస్త మానవాళికి మార్గదర్శిని. ఈ మాసంలోనే రోజా వ్రతం విధిగా నిర్ణయించబడింది. వేయి మాసాల కన్నా విలువైన రాత్రి అని చెప్పబడిన 'లైలతుల్ ఖద్ర్' ఉంది. ఈ మాసంలో చేసే ఒక్క సత్కార్యానికి అనేక రెట్లు అధికంగా పుణ్యఫలం లభిస్తుంది. ఒక విధిని ఆచరిస్తే డెబ్బై విధులు ఆచరించిన దానితో సమానమైన పుణ్యం లభిస్తుంది. సమాజంలో మంచి మార్పు కనిపిస్తుంది. 'ఫిత్రా' ఆదేశాలు కూడా ఈ మాసంలోనే అవతరించాయి. ఫిత్రా అన్నది పేదసాదల హక్కు, ఫిత్రాల వల్ల వారికి ఆర్థికంగా కాస్త ఊరట లభిస్తుంది. జకాత్ కూడా ఈ మాసంలోనే చెల్లిస్తారు. ఇది కూడా పేదసాదల ఆర్థిక అవసరాలు తీర్చడంలో గణనీయంగా తోడ్పడుతుంది. 'తరావీహ్' నమాజులు కూడా ఈ మాసంలోనే ఆచరించబడ తాయి. అదనపు పుణ్యాలు మూటగట్టుకోవడానికి ఇదొక సువర్ణా వకాశం. ఈ పవిత్ర మాసంలో ఎవరైతే ధర్మనిష్టతో ఆత్మ పరిశీలనతో పరలోక ప్రతిఫలాపేక్షతో రమజాన్ రోజాలు పాటిస్తారో వారు గతంలో చేసిన పాపాలను అల్లాహ్ మన్నిస్తాడు. సహనం వహించవలసిన -2లో

## ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మొదటి స్థానంలో బండారి సంకీర్తన



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 18 :** నేషనల్ సైన్స్ డే సందర్భంగా బుధవారం ఎఫ్‌పిఎస్‌టి నిర్వహించిన మండలస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మొదటిస్థానంలో ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బండారి సంకీర్తన తండ్రి రాజు ఎంపికయ్యారు.వీరికి ఎఫ్ పి ఎస్ టి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ దరిపెల్లి శ్రీనివాస్,పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు గరుగుల స్వామి ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

**మొదటి పేజీ తరువాయి...** శాఖలు సమర్ధ వంతంగా సన్నద్ధం కావాలని, విద్యార్థులకు ఎట్టి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ పరీక్షా కేంద్రాల దగ్గర ఎటు వంటి లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య సదుపాయం, రవాణా సౌకర్యం, పోస్టల్ శాఖపరమైన చర్యలు, 144 సెక్షన్ అమలు చేయడం, విద్యుత్ సౌకర్యం, ప్రమాదాల పట్ల, విద్యార్థుల భద్రతా పట్ల ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని విద్యార్థులు 100 శాతం లక్ష్యాలను సాధించడానికి తోడ్పాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము మరియు జిల్లా పరీక్షల విభాగం అధికారి నరేందర్, జిల్లా స్థాయి అధికారులు, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆర్టీసీ, ట్రెజరీ, ఫైర్ అండ్ సేఫ్టీ, జిల్లా పంచాయతీ శాఖ, విద్యుత్ శాఖ, పోస్టల్ శాఖ, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ ఫలితాల్లో జగిత్యాల ఆల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 18 :** ఐఐటీ జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో జగిత్యాల అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ విద్యార్థులు జా తీ య ం స్థా ం ు ు లో అత్యున్నత ప్రతిభ కనబరిచి ఉత్తమ పర్సంటైల్ సాధించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన జగిత్యాల విద్యార్థిని జి లాస్య రెడ్డి 96.87 ని అభినందించారు. అదేవిధంగా ఎండి జబీరుద్దీన్ 88.03, ఎండి అజీబ్ ఖాన్ 86.34, జి సహస్ర ర 80.03 పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. రెండో విడత ఫలితాల్లో విద్యార్థులందరూ కూడా ఇంకా మంచి ఫలితాలతో అఖండ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# రమజాన్ మాసం వరాల వసంతం

**మొదటి పేజీ తరువాయి...** నెల రమజాన్,రమజాన్ మాసం సహనం, నిగ్రహం పాటించవలసిన నెల, సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది సమాజంలోని ఉపేక్షితుల పట్ల, బాధితుల పట్ల సానుభూతిని చూపించాల్సిన నెల. శారీరక సాధనాలు, ఆరాధనలు, ఉపవాసనలు, గ్రంథ పారాయణాలు మనిషి అంతర్యంలో పరివర్తన తెస్తాయి. మనిషి ఆలోచనా తీరు మారుతుంది. ఉన్నత ప్రమాణాలు అలవడతాయి. ఫలితంగా మునిషి ప్రవర్తనలలో నైతికత, మంచితనం, ప్రశాంతత, నిష్టా గరిష్టత, పదాచారం చోటుచేసుకుంటాయి.మనిషి ఆధ్యాత్మికతకు, సర్వతోముఖాభివృద్ధికి, మనోవికాసానికి రమజాన్ దారి చూపిస్తుంది. ఇది విశ్వప్రభువు సందేశమైన దివ్య ఖుర్ఆన్ ను మానవాళికి ఈ మాసంలోనే అందించింది. ఈ అంతిను దివ్య ఖుర్ఆన్ ఆవతరం సాధారణ విషయం కాదు. అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న ఆనాటి అరబ్బులను విజ్ఞాన పథంలోకి మార్చి, వారిని విద్యా పోషకులుగా, క్రమశిక్షణా దురం ధరులుగా సంస్కారవంతులుగా చేసింది. బాధితులు, అణగారిన వారి కోసం, పోరాడే వారిగా మనుమల్ని తీర్చిదిద్దింది. పవిత్ర ఖుర్ఆన్ అవసరార్థుల కోసం, ప్రేరణాత్మక, విప్లవాత్మకమైన జీవన విధానాన్ని, నిరాడంబరమైన నైతిక జీవితాన్ని ప్రపంచానికి అందించింది.

సౌమ్ అంటే ఉపవాసం

ఉపవాసాన్ని అరబీ భాషలో 'సౌమ్' అంటారు. దీని అర్థం 'ఆగి పోవడం', 'నియంత్రించుకోవడం'. ఈ నెలలో ఆహారపదార్థాలను కొంచెం దూరంగా ఉండటమే కాదు. తమను తాము చెడు నుంచి కూడా దూరంగా ఉంటారు.

ఫిత్రా నిరుపేదల హక్కు

ఫిత్రా దానం పేదల పాలిట పెన్నిధి. వారు పండుగ పూట పస్తు లుండకుండా అందరితో పాటు వారు కూడా సంతోషంగా పండుగ పూట గడిపేందుకు దైవం దీన్ని విధిగా చేశాడు. ఫిత్రా దానం వల్ల మూడు ప్రయోజనాలు కలుగుతాయి. ఒకటి విశ్వాసి మాత్రం ఫిత్రా చెల్లించి తన ఆనందాన్ని ప్రకటిస్తూ అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. రెండు, ఉపవాసస్థితిలో జరిగిన పొరపాట్లు ఫిత్రా చెల్లించడం వల్ల దూరమవుతాయి, మూడు, ఇది నిరుపేదల ఇళ్ళల్లో సంతోషాన్ని, ఆనందాన్ని నింపుతుంది. వారు సంతోషంగా పండుగ జరుపుకునేందుకు ఉపయోగపడుతుంది.

అసమానతలను తొలగించే సాధనం జకాత్

జకాత్ అన్న పదం 'జకీ' నుంచి వచ్చింది. జక అంటే అర్థం పెరుగుట, ఎదుగుట, వృద్ధి చెందుట, అభివృద్ధి, వ్యాపించుటం మొదలైనవి. జకాత్ అంటే ప్రతి ధనవంతుడు తన ధనం నుండి కొంత ధనాన్ని అవసరమైన వారికి ఇవ్వడం. నిర్ణీత సమయంలో, నిర్ణీత ధనంనుండి నిర్ణీత ప్రజల కొరకు ఇచ్చే ధనమే జకాత్

తరావీహ్ నమాజ్

రమజాన్ నెలలోని తరావీహ్ నమాజు పుణ్యం రీత్యా ఎంతో ఘనమయిన నమాజు. దాన్ని నెరవేర్చమని హదీసుల్లో తాకీదు చేయబడింది. అయినప్పటికీ అది నఫిల్ నమాజు మాత్రమే. ఈ నఫిల్ నమాజును రమజాన్ నమాజుగా పేర్కొనటం జరిగింది. కాని తర్వాతి కాలంలో ఇది 'తరావీహ్ నమాజ్'గా నామాంతరం జరిగింది. తరావీహ్ అనేది తర్వీహ్ అనే పదానికి బహు వచనం. తరావీహ్ అంటే విశ్రాంతి, విరామం అని అర్థం. మహాప్రవక్త(స) అనుచరులు ఆయన సంప్రదాయానుసారం చాలాసేపు నిలబడి నమాజు చేసేవారు. ఆ విధంగా నాలుగు రకాతుల తరువాత కాసేపు విశ్రాంతి తీసుకునేవారు. ఎవరయితే ధర్మనిష్టతో ఆత్మ పరిశీలనతో పరలోక ప్రతిఫలా పేక్షతో తరావీహ్ నమాజ్ చేస్తాడో అతడు పూర్వం చేసిన అపరా ధాలను అల్లాహ్ క్షమిస్తాడు. (ముత్తపకున్ అలైహి) దైవప్రవక్త(స)రమజాన్ మాసం చివరి పదిరోజులు ఏతెకాఫ్ చేసే వారని అబ్దుల్లా బిన్ ఉమర్(ర) తెలిపారు. (బుఖారీ, ముస్లిమ్) హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ సందేశహరులు (స) రమజాన్ చివరి పది రోజులు రాగానే రాత్రిళ్ళు ఇతోధికంగా జాగరణ చేసి దైవారాధనలో గడిపేవారు. తన సతీమణుల్ని కూడా మేల్కొలిపేవారు. అధికోత్సహంతో దైవారాధనలో నిమగ్నులయ్యే వారు.

# 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో కీలకంగా లైఫ్ సైన్సెస్

**మొదటి పేజీ తరువాయి....** రెండేళ్లలోనే (డిసెంబర్ 2023 – జనవరి 2026) రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్ లో "బయో ఏషియా 2026" సదస్సులో భాగంగా "తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం" పేరిట నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్, ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో "తెలంగాణ రైజింగ్ 2047"కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే.... తెలంగాణ నెక్స్ట్ – జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026– 2030), తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యుబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. ఈ ఏడాది సదస్సులో సనోఫీ , ఒపెల్లా వ్యాక్సిండో యానిమల్ హెల్త్, ట్రెడెన్స్, ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు ముందుకొచ్చాయన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. 'బయో ఎకానమీ' రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్ కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి... ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసారి ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులతో పాటు దేశ విదేశాల నుంచి మొత్తం 4,394 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల కోసం 4వేలకు పైగా అత్యున్నత స్థాయి బిజినెస్ టూ బిజినెస్(బీ2బీ) సమావేశాలకు ఈ ఏడాది సదస్సు వేదికగా నిలిచిందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లను...

**మొదటి పేజీ తరువాయి...**అలుగునూరు కోతి రాంపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల ప్రగతిని క్షేత్రస్థాయిలో ఎండి గౌతం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో కలిసి పర్యవేక్షించారు. ఇండ్ల నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. లబ్ధిదారులతో ఎండి స్వయంగా మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనులకు ఎంత ఖర్చయింది.. ఎలా పనులు చేయిస్తున్నారు.. ఇసుక.. ఇటుక..కంకర కు ఎంత ధర చెల్లిస్తున్నారు.. బిల్లులు సకాలంలో వస్తున్నాయా.. నిర్మాణ పనుల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా.. ఇప్పటివరకు పనులకు ఎంత ఖర్చు చేశారు.. పనులను ఏ విధంగా చేస్తున్నారు అని సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అన్ని వివరాలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేయడంతో హ్యాపీగా ఫీల్ అవుతున్నామని వారు ఎండికి వివరించారు. సొంటి కల నెరవేరుతున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎండి గౌతమ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ పెండింగ్లో పెట్టవద్దని పనులు మరింత వేగవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొదటి దశలో ప్రారంభించిన ఇండ్ల తుది పనులు మార్చి 31పూర్తి కావాల్సిందేనని పేర్కొన్నారు. పనులకు సంబంధించి ఎక్కడా జాప్యం జరగవద్దని అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా ఇసుక ఇటుక సిమెంటు కొంత చౌక ధరల్లో లభించేలా అధికారులు డీలర్లు నిర్వాహకులతో మాట్లాడాలని ఆదేశించారు. కొంత ధర తగ్గడం వల్ల లబ్ధిదారులకు చేయూతనందించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. దగ్గర్లో ఉన్న ఇసుక క్వారీల నుంచి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేసేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రోగ్రెస్ చాలా బాగుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో పాటు అధికారులను అభినందించారు. బిల్లులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు వారం పదవులకు ఒకసారి బిల్లులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఆ తర్వాత కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో ఎండి గౌతమ్ సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రెడీ చేసి లబ్ధిదారులకు అందించే లా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకేమైనా పనులు పెండింగ్లో ఉంటే వాటిని పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో హౌసింగ్ పీడీ శ్రీనివాస్ ఆర్ అండ్ బి ఈఈ నరసింహ చారి తహసిల్దార్ శ్రీనివాస్ రెడిహౌసింగ్ అధికారులు అధికారులు పాల్గొన్నారు.

# ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై నజరేది

**-నిర్లక్ష్యానికి బాధ్యులెవరో...!**
**-ప్రమాదం జరిగినప్పుడే అధికారుల హడావిడి**



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఫిబ్రవరి 18 :** ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులు ప్రమాదాలు జరుగుతున్నా... చిన్నారులు గాయాలపాలవుతుండడంతో సంబందిత అధికారులు నజర్ పెట్టడం లేదు. ఆర్డీవో అధికారులు నజర్ వేయకపోవడంతో ఫిట్నెస్ లేని స్కూల్ బస్సుల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం యధేచ్చగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నా పట్టించుకోవడంలేదని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల మల్లాపూర్ మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు ఫిట్నెస్ లేకుండా నడుతుండడంతో కొన్ని చోట్ల విద్యార్థులతో బస్సు ఆగిపోగా అటు వాగా వెళ్లే బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ఆ స్కూల్ బస్సును తోయ్యాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి చెట్టుకు ఢీకొట్టిన స్కూల్ బస్సులో పలువురు చిన్నారులు గాయాల పాలయ్యారు.నిత్యం మల్లాపూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులతో పదుల సంఖ్యలో స్కూల్ బస్సులు మెట్ పల్లి పట్టణానికి వస్తుంటాయి. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లకు అనుభవం ఉన్నా, లైట్ మోటర్ వేకిల్ లైసెన్సులుండగా మరికొందరైతే గడువు తీరిన హెవీ లైసెన్స్ లతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం స్కూల్ బస్సులను నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిట్నెస్ ని స్కూల్ బస్సుని, నిబందనలకు విరుద్దమని తెలిసినా ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు చిన్నపనే కదా అంటూ రెండు రోజుల్లో చేపిద్దాం అంటూ కాలం వెళ్లదీస్తున్నారని స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్కూల్ బస్సుల ఫిట్నెస్ లేని బస్సులపై దృష్టి సారించి విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.



# కో అప్షన్ పదవులు.. నియామకాలు ఇలా..



**చురకలు విలేకరి,జగిత్యాల ఫిబ్రవరి 18 :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2019 నూతన మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ల లో, మున్సిపాలిటీల్లో కో అప్షన్ సభ్యుల నియామకాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఆ ఉత్తర్వుల వివరాలను తెలంగాణ రెవిన్యూ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జగిత్యాల మాజీ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఇలా వివరించారు.పాలక వర్గాల ఎన్నికలు పూర్తయ్యాక ఆయా కార్పొరేషన్, మున్సిపాలిటీల వార్డులు, డివిజన్ల సంఖ్య ఆధారంగా కమిషనర్ కో అప్షన్ సభ్యుల ఎంపిక కోసం ప్రత్యేక నోటిఫికేషన్ ప్రకటిస్తారు.అర్హత కలిగిన అభ్యర్థులు నామినేషన్లు సమర్పిస్తారు.మైనారిటీ కోటా కింద పోటీ చేసే వారు తమ కుల ధ్రువీకరణ పత్రంను నామినేషన్ తో జత చేయాలి.అభ్యర్థులు తమ అర్హతలను వెళ్ళడించాల్సి ఉంటుంది.పదవుల కంటే ఎక్కువ పోటీ ఉంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లు చేతులెత్తే విధానం ద్వారా లేదా రహస్య ఓటింగ్ ద్వారా కో అప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు.

**అర్హతలు ఇలా...**

కో అప్షన్ సభ్యులుగా పోటీ చేసే వారు సంబందించిన కార్పొరేషన్, మున్సిపాలిటీలో ని ఓటర్ జాబితాలో పేరు కలిగి 21 ఏళ్ళు నిండి ఉండాలి.పురపాలనలో అనుభవం, విద్య, వైద్యం, సాంకేతిక, లేదా సామాజిక సేవా రంగంలో అనుభవం లేదా ప్రత్యేక సేవలు చేసి ఉండాలి.,మైనారిటీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా నియమాలు (జీవో. ఎం. ఎస్. 57, 58) ఉన్నాయి.

**అనర్హతలు:**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులైన వారు, లేదా ఇతర చట్ట పరమైన కారణాల వల్ల అనర్హులు కో అప్షన్ సభ్యులు గా పోటీ కి వీలు లేదు.

**భాధ్యతలు.. అధికారాలు :**

మున్సిపల్ నూతన చట్టం 2019 సెక్షన్ (4)5 ప్రకారం మున్సిపల్ కో అప్షన్ సభ్యులకు కూడా కౌన్సిలర్ల తో సమాన హోదా ఉంటుంది.మున్సిపల్ పాలక వర్గం ఉన్నంత వరకు కో అప్షన్ సభ్యులుగా కొనసాగుతారు.మున్సిపల్ సమావేశాల్లో వీరు పాల్గొనవచ్చు. ప్రజా పాలనపై చర్చలు చేయవచ్చు.గౌరవ వేతనం, ప్రోత్సహకాలు పొందే వీలుంది.

# రహదారి విస్తరణకు భూసేకరణ గ్రామ సభ

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 18 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం కాళేశ్వరం లింక్ 2 పంప్ హౌస్ ప్రాజెక్టులో భాగం గా పెద్దవాగుపై నిర్మించిన రెండు బ్రిడ్జిల ఇరుప్రక్కల రోడ్డువిస్తరణ కు గాను వెల్గటూర్ శివారులోని 1.07 గుంటల భూమిని రైతుల నుండి సేకరించేందుకు బుధవా రం స్థానిక పంచాయతీ కార్యాల యంలో గ్రామ సభ నిర్వహించా రు. భూములు కోల్పోతున్న 14 మందిలో 12 మంది హాజరు కాగా జగిత్యాల ఆర్డీఓ మధు సూదన్ రైతులతో మాట్లాడుతు బ్రిడ్జిల ప్రక్కన రోడ్డు విస్తరణ కోసం ఇట్టి భూమిని సేకరిస్తున ట్లు గతంలో ప్రాజెక్ట్ కోసం సేకరించిన భూమికి ఎంతైతే ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం చెల్లించామో దానికి మూడు రేట్లు కలిపి నష్టపరి హారం చెల్లిస్తామని తెలిపారు.దీనికిగాను రైతులు రెండురోజుల్లో ఆలోచించుకొని రేటునచ్చితే సమ్మతిస్తామని తెలుపడంతో త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆర్డీఓ కోరారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీఓ వెంకటప్రసాద్,ఆర్ఐ, రాజేశ్వరి, సర్పంచ్ బండమీది కవిత గోపి, ఉపసర్పంచ్ గండ్ర ప్రతాప్ రావు, రాజక్కపల్లె సర్పంచ్ మల్లేశం, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.





## మనస్థాపంతో వృద్ధురాలు ఆత్మహత్య



**చురకలు విలేకరి,మల్లాపూర్, ఫిబ్రవరి 18 :** ఒంటరిగా ఉన్నాననే మనస్థాపంతో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ముత్యంపేట గ్రామంలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పుల్లూరి నీల(65) అనే వృద్ధురాలికి కొడుకు రమేశ్, కూతురు రమలున్నారు.ఇరువురికి వివాహం చేయగా కోడుకు ఉపాధి నిమిత్తం కోరుట్ల పట్టణంలోని నివాసం ఉన్నాడు. ఇటీవల ఇంటి వద్ద కాలుజారి పడి చెయ్యి విరిగిపోయింది.ఇంటిలో ఒంటరిగా ఉండడంతో మనస్థాపానికి గురైనా వృద్ధురాలు గ్రామశివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది.కూతురు రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

## అంగన్వాడీలో అక్షరాభ్యాసం



**చురకలు విలేకరి,మల్లాపూర్,ఫిబ్రవరి 18 :** మల్లాపూర్ మండలంలోని చిట్టపూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో అంగన్వాడీలు గర్భిణీ స్త్రీలకి శ్రీమంతలతో పాటు మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం 6నెలలు నిండిన పిల్లలకి అన్నప్రాసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచి సంపతి శంకరమ్మ,ఉపసర్పంచ్ బాల్సాని ప్రణయ్ గౌడ్,ఏఎన్ఎం పద్మ,ఎంఎల్ హేహెచ్పి దేవి ప్రసన్న, అంగన్వాడీలు శ్రీదేవి, స్వరూప, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ అరవ లక్ష్మికి సన్మానం



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 18 :** జగిత్యాల మున్సిపల్ 22వార్డు కౌన్సిలర్ ఆరవ లక్ష్మి ఏసిఎస్ రాజును బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ముసిపట్ల లక్ష్మీనారాయణ,దాసరి దామోదర్, నాలువల శ్రీకాంత్,దొండపాటి జనార్ధన్ రెడ్డి, బండి సత్యనారాయణ ,దొనకంటి రాజేశ్వర్ రావు,బ్రాహ్మణపెల్లి రాజేందర్,జనార్ధన్ రెడ్డి పక్కునూరి భూమేశ్వర్,కిషన్ తదితరులు కౌన్సిలర్ లక్ష్మి రాజు జగిత్యాలలోని ఇంటికి బుధవారం వెళ్లి ప్రజలు ఆశీర్వదించి గెలిపించినందుకు వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## టిపిసిసి చీఫ్‌ను కలిసిన మున్సిపల్ చైర్పర్సన్



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 18 :** జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ గా ఎన్నికైన సమీండ్ల వాణి శ్రీనివాస్ బుధవారం హైద్రాబాద్లో టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు పుష్పగుచ్చం అందించి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాం

**-సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు**

**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య**


కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య

**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 18 :** మున్సిపల్ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించడంతోపాటు చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతం గా నిర్వహించడంలో సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తల కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తెలిపారు.ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ తో పాటు జిల్లా యంత్రంగానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించి మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తదితరులకు నందయ్య కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వంతో సహకరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపులో ప్రధాన పాత్ర వహించి నియోజక వర్గంలోని మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో భాగస్వామ్యమైన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని జగిత్యాల, రాయికల్, ధర్మపురి, కోరుట్ల, మెట్పల్లి మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో జగిత్యాల జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధికి పాటుపడతారని ఆకాంక్షిస్తున్నట్లు నందయ్య తెలిపారు.

## సర్పంచులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 18 :** గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల న్యాక్ కేంద్రంలో జగిత్యాల నియోజకవర్గ సర్పంచుల నిర్వహిస్తున్న 5 రోజుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిధిగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థాయి పాలనపై సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ మదన్ మోహన్,న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీడీవోలు, సర్పంచులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరిని కలిసిన మున్సిపల్ చైర్పర్సన్



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 18 :** జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ గా ఎన్నికైన సమీండ్ల వాణి శ్రీనివాస్ బుధవారం హైద్రాబాద్లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్కు పుష్పగుచ్చం అందించి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## జేఈఈ ఫలితాల్లో మోరపల్లి విద్యార్థి ప్రతిభ

**-99.77 పర్సంటైల్తో సత్తా చాటిన హితేష్**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 18 :** జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన కట్ట హితేష్ జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటాడు. ఇటీవల విడుదలైన జేఈఈ ఫలితాల్లో 99.77 పర్సంటైల్ సాధించాడు. మోరపల్లి గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్ – జమున దంపతుల కుమారుడైనా హితేష్ హైదరాబాద్లోని శ్రీవశిష్ట ఏడ్యూకేషనల్ ఇన్స్టిట్యూట్ లో శిక్షణ పొందినట్లు విద్యార్థి తండ్రి, గ్రామ సర్పంచ్ రాజేందర్ తెలిపారు. తన కుమారుడు సాధించిన పర్సంటైల్ తనకు అంత్యంత సంతృప్తిని ఇచ్చిందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా హితేష్ కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## పెగడపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండి లెక్కింపు

**-మహాశివరాత్రి ఉత్సవాల ఆదాయం 11,51,254 రూ.లు**



**చురకలు విలేఖరి పెగడపల్లి, ఫిబ్రవరి 18 :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండి లెక్కింపును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా 11,51,254 రూ.లు ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ బుధవారం తెలిపారు.

## పెగడపల్లిలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సాధారణ సమావేశం



**చురకలు విలేఖరి పెగడపల్లి, ఫిబ్రవరి 18 :** జగిత్యాల జిల్లా మండలంలోని పెగడపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గ సాధారణ సమావేశాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా త్రాగు నీటి సమస్య తలెత్తకుండా తీసుకునే జరిగిన గురించి సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ ఒరుగల అరుణ, ఉప సర్పంచ్ బత్తుల ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వార్డ్ మెంబర్లు నంది మహిపాల్, మక్కపెల్లి మల్లేశం, భోగ లక్ష్మీనారాయణ, ఒరుగల అంజమ్మ, ఏడుమ్యాకల పద్మ, బొమ్మెణ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## నాగాలయంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పూజలు



**చురకలు విలేకరి,రాయికల్, ఫిబ్రవరి 18 :** రాయికల్ మండలం అల్లీపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాయికల్ మండలం కొత్తపేట నాగలయంలో రాజరాజేశ్వరిస్వామి వారి ప్రత్యేక పూజలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పాల్గొన్నారు.వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## శ్రీ అక్క పెల్లి రాజరాజేశ్వర స్వామి హుండీ లెక్కింపు



**చురకలు విలేకరి,ధర్మపురి,ఫిబ్రవరి 18 :** ధర్మపురి పట్టణంలోని శ్రీ అక్క పెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీని బుధవారం విప్పిలెక్కించగా 2లక్షల 6 వేల 727 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ తెలిపారు.ఇట్టి హుండీలో విదేశి కరెన్సీ 04,మిశ్రమ బంగారం మిశ్రమ వెండి స్వల్పంగా వచ్చినందున అందరి సమక్షంలో తిరిగి హుండీలో పెట్టి సీల్ వేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, దేవస్థానం అర్చకులు బూస ప్రవీణ్ కుమార్, జన్మంచి శ్రీనివాస్, దేవస్థానం మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, మాజీ చైర్మన్ చెన్నోజు రాజేంద్రప్రసాద్,మాజీ దేవస్థాన సభ్యులు ఒడ్డేటి రాజయ్య, సురుకంటి గంగారెడ్డి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, శ్రీవల్లి సేవ గ్రూప్ పెద్ద పెల్లి పుష్పలత, కటకం సుదర్శన్ మరియు సభ్యులు, దేవస్థానం సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆంజనేయస్వామి ఆలయ అర్చకులు మృతి

**-వెల్గటూర్లో నెలకొన్న విషాదం**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 18 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ అర్చకులు వకులాభరణం నరసింహ స్వామి బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతిచెంద దంతో గ్రామంలో విశాదం నెలకొంది. ఉదయం దుబ్బరాజే శ్వర స్వామి ఆలయ దర్శనానికి ద్విచక్ర వాహనంపైవెల్లి వస్తుండ గా ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు అర్చకత్వం తోపాటు తపాల శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తించి రిటైర్ అయ్యారు. ఈయన మరణం పట్ల గ్రామస్థులు,భక్తులతోపాటు గ్రామ సర్పంచ్ బండమీది కవిత గోపి, ఉపసర్పంచ్ గండ్ర ప్రతాప్ రావు,మాజీ మండల పరిషత్ అధ్యక్షులు తిప్పర్తి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ మేరుగు మూరళి గౌడ్,ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేష్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గండ్ర శ్రీకాంత్ రావు,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నక్క లక్ష్మన్,మాజీ ఉప సర్పంచ్ సందీప్ రెడ్డి పురప్రముఖులు, యువజన సంఘాల ప్రతినిధులు,తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# బిజెపిని అడ్డుకుంటానని నమ్మించి మేయర్ కుర్చీనీ అప్పజెప్పిన గంగుల

**-ముస్లింలను, దళితులను బిజెపి భయం చెప్పి ఓట్లు దండుకున్నారు**

**-బిఆర్ఎస్‌ను ఖతం చేసి బిజెపినీ లేపిన ఎమ్మెల్యే గంగుల రాజీనామా చేయాలి**

**-బిజెపి చేతిలో ఓడిన జమీలోద్దీన్ ఎంఐఎంను విమర్శించడం సిగ్గుచేటు**

**-బిఆర్ఎస్ మైనార్టీ నేతలకు ఎంఐఎం నేతల స్ట్రాంగ్ కౌంటర్**




**చురకలు ప్రతినిధి,కరీంనగర్ ఫిబ్రవరి 18 :** కరీంనగర్ లో బిజెపిని నిలువరించే శక్తి తనకే ఉందని ప్రగల్బాలు పలికిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్, తీరా ఇప్పుడు మేయర్ కుర్చీని పరోక్షంగా బిజెపికి అప్పజెప్పారని, 2023లో బీజేపీ పేరు చెప్పి దళితులను, ముస్లింలను బెదిరించి ఓట్లు దండుకుని, తీరా ఇప్పుడు ఓటింగ్ లో పాల్గొనకుండా తటస్థంగా ఉండటంలో ఆంతర్యం ఏమిటని ఎంఐఎం పార్టీ నాయకులు అన్నమల్ల సురేష్, గాలి రాజు, లింగంపల్లి శ్రీనివాస్, బెజ్జంకి సుధాకర్ లు ఆరోపించారు. బుధవారం ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ కరీంనగర్లో 40కి పైగా కార్పొరేటర్లు ఉన్న బి.ఆర్.ఎస్ పార్టీ కేవలం 9 స్థానాలకు పరిమితమై వెంటి లెటర్ పై కొట్టుమిట్టాడుతోందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి, గంగుల కమలాకర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు నగరంలో బిఆర్ఎస్ పార్టీని ఖతం చేసి బిజెపిని లేపాలనే ఉద్దేశంతో ఎన్నికల నోటిఫికేషన్కు కొద్ది రోజుల ముందు 15మంది బిఆర్ఎస్ కార్పొరేటర్లు బిజెపిలోకి ఎలా వెళ్లారని ప్రశ్నించారు. బిజెపిలోకి వెళుతున్న వారిని గంగుల కమలాకర్ పిలిచి మాట్లాడి, వారిని ఎందుకు అడ్డుకోలేకపోయారని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యే గంగుల అవినీతి అక్రమాలను ప్రోత్సహించడం, భూమాఫియాను ప్రోత్సహించడం, పేద ముస్లింల, దళితుల ఇండ్లను బుల్డోజర్ తో కూల్చివేయడం వంటి ఘటనలతో కరీంనగర్లో 10సీట్లకు పరిమితమైన బిజెపి 30సీట్లకు పెరిగిందన్నారు. 32వ డివిజన్లో కార్పొరేటర్ గా గెలిచిన యూసుఫ్, గంగుల కమలాకర్ వల్ల గెలవలేదని సానుభూతి ఓట్లతో గెలిచాడన్నారు. గత మూడు పర్యాయాలు ఓడిపోయి నాలుగోసారి యూసుఫ్ గెలిచాడని, మరో ఇద్దరిలో ఒకరు ఎంఐఎం నుంచి వెళ్లి, ఇండిపెండెంట్ ఎంఐఎం రెబెల్ అని, ఇందులో గంగుల కమలాకర్ చెమటోడ్చి గెలిపించిన కార్పొరేటర్లు ఎవరో ముస్లిం సమాజం ఆలోచన చేయాలన్నారు. బిజెపి చేతిలో ఓడిపోయిన కొత్తపల్లి జమీలుద్దీన్ ఎంఐఎంలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుడైన జమీలోద్దీన్ కు 9ఏండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవిని గంగుల కమలాకర్ ఇప్పించడంలో ఘోరంగా విఫలమయ్యాడన్నారు. కేవలం బిఆర్ఎస్ కు చెందిన న్యూస్ ఛానల్ లో మాట్లాడటానికి మాత్రమే జమీలుద్దీన్ ను పరిమితం చేసి, క్రియాశీల రాజకీయాలకు దూరంగా పెట్టడానికి, బిజెపి తో లోపాయకారి ఒప్పందంతో జమీలోద్దీన్ ను, గంగుల కమలాకర్ ఓడించడాన్నారు. ముస్లింలు రాజకీయంగా ఎదగకుండా ఉండేందుకు కుట్రతో 2020 మున్సిపల్ ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు గెలిచే సీట్లలో టికెట్లు ఇవ్వకుండా ద్రోహం చేసిన చరిత్ర గంగుల కమలాకర్ దన్నారు. ఎంఐఎం పార్టీని అంతం చేయాలనుకోవడం, ఉదయించే సూర్యుడు పై ఉమ్మివేసినట్లేనని గంగుల కమలాకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రహించాలన్నారు.

# విద్యార్థులకు ఇంటర్ విద్య ఎంతో కీలకం

**చురకలు విలేఖరి వీణవంక ఫిబ్రవరి 18 :**

వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీణవంక గ్రామ సర్పంచి దాసారపు సరోజన రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ..మన గ్రామములో ఉన్నటువంటి కళాశాలను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు కన్న కలలని నిజం చేయండి మన ఊరు ప్రతిష్టను పెంచాలనీ కోరారు.ప్రిన్సిపాల్ కే.రాజిరెడ్డి మాట్లాడుతూ..విద్యార్థికి ఇంటర్ విద్య




కీలకమైనదని బాగా కష్టపడి చదివి తల్లిదండ్రులకు గురువులకు కళాశాలకు మంచి పేరు తేవాలని సమాజంలో ఉన్నతమైన స్థానంలో నిలవాలని జీవితంలో స్థిరపడాలని తెలిపారు కళాశాల రిజల్ట్ తీసుకురావడంలో విద్యార్థులు ముందుండాలని కళాశాల ఈ సంవత్సరశీ విద్యార్థులు పాస్ పర్సంటేజ్ పెంచాలని అన్నారు.సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యాబోధన బాగుందని ఉన్నతమైనటువంటి శిఖరాలు చేసుకోవటానికి ఇంటర్ విద్య కీలకమని వారు జూనియర్ విద్యార్థులకు చెప్పారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. మండలంలోని పలువురు హెచ్ఎంలు విద్యార్థులకు మార్గదర్శ మార్గ దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులి అశోక్ రెడ్డి, సత్యం,శ్రీనివాస్,గ్రంథ పాలకుడు ఎన్ రామ్మోహన్,అధ్యాపకులు భాస్కర, శైలజ ,శోభన్,బాబు,సుమలత, కరుణ, రవీందర్,స్వప్నలతోపాటు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** కమాన్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోఎఫ్ పి ఎస్ టిపెద్దపల్లిల్ల వారి ఆధ్వర్యం లతి 8.9 వ తరగతుల విద్యార్థులకు మండల స్థాయి ఫిజకల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో కమాన్ పూర్, జూలపల్లి మరియు రొంపికుంట ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా జి. రిషిక్ సాయి జిల్లా పరిషత్ పాఠశాల జూలపల్లి అనే విదార్థి మొదటి స్థానం



లో కె. రుచిత జిల్లా పరిష త్ పాఠశాల కమాన్ పూర్ అనే విద్యార్థి ద్వితీయ స్థానం లో నిలిచారు. మొదటి, ద్వితీయ స్థానం సాధించిన ఇద్దరు విద్యార్థులు ఈనెల 23-నాడు పెద్దపల్లి బాలికల ఉన్నత పాఠశాల లో జరిగే జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ ఊలెంట్ టెస్టు లో పాల్గొంటారు. మొదటి, ద్వితీయ స్థానం సాధించిన ‘ విద్యార్థులను మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ అభినందిస్తూ జిల్లా స్థాయిలో కూడ మంచి ప్రతిభను కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో .. ఫిజకల్ సైన??స్న ఉపాధ్యాయులు శ్రీ జి రాజేశ్వర్ రావు, పి. సతీష్, ఎం. శ్రీనివాస్ రెడ్డి పాయ ఎం శ్రీనివాస్ మరియు కె శ్రీనివాసు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేటలో ప్రతి శనివారం గొర్రె మేకల అంగడి

**-గాయత్రి డిగ్రీ కళాశాల సాదు వెంకటరెడ్డి ఐటిఐ కాలేజీ మధ్యగల కాళీ మైదానం పరిశీలించిన సర్పంచ్ పాలకవర్గం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 18 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారి ప్రక్కనగల గాయత్రీ డిగ్రీ కళాశాల సాధు వెంకట్రెడ్డి ఐటిఐ కాలేజీ మధ్య గల కాళీ మైదానంలో ప్రతి శనివారము గొర్రె మేకల అంగడిని ఏర్పాటు చేయడానికి బుధవారం సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఆధ్వర్యంలో పాలకవర్గం స్థల పరిశీలన చేసింది.ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు మాట్లాడుతూ గొర్రె మేకల వ్యాపారులు పెంపకం దారులు యాదవుల ఆరే కటిక సోదరులు ప్రతి శని వారము ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహించే గొర్రె మేకల అంగడికి తమ గొర్రెలను మేకలను అమ్మకాలు కొనుగోలు చేపట్టడానికి అవసరమున్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలని అంగడిలో అందరికీ గ్రామపంచాయతీ తరపున కనీస సౌకర్యాలన్ని కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.అక్కడ ఏఎంసీ చైర్మన్ గుండాడి రాంరెడ్డి,ఉపసర్పంచ్ బందారపు బాల్రెడ్డి సింగిల్ విండో మాజి డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి వార్డు సభ్యులు ఆంజనేయులు,అంగూరి ప్రవీణ్ , బాలకిషన్ గౌడ్ కొత్త చెన్నయ్య నాయకులు బండారి బాల్రెడ్డి నంది కిషన్ నేవూరి శ్రీనివాస్ రెడ్డి జవాజి లింగం,ఎలగందుల బాబు కర్రోల్లా ఎల్లయ్య ఎరుపుల హనుమయ్య గన్న శ్రీనివాస్‌రెడ్డి శ్రీకాంత్ రెడ్డి,గడ్డం వెంకట్,మిర్యాలకర్ క్రాంతి కుమార్,నేవూరి సంతోష్ రెడ్డి,రంజిత్ రెడ్డి,గడ్డంవెంకట్‌లు స్థలపరిశీలన చేశారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన యూనివర్సల్ విద్యార్థులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** పాలకుర్తి మండలం జిడి నగర్ పరిధిలోని యూనివర్సల్ ఐఐటి పాఠశాల 15 మంది విద్యార్థులు సీఎం కప్ లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సీఎం క్రీడా పోటీలు ఈనెల 12 నుండి 17 వరకు జరిగిన జిల్లా అథ్లెటిక్,సైక్లింగ్,వెయిట్ లిఫ్టింగ్, స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.వీరు ఈనెల 20 నుండి జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కలవల సంతోష్ తెలిపారు.రాష్ట్రస్థాయి ఎంపిక అయిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మమ్మద్ ఇస్మాయిల్ ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్ అభినందించారు.

## పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు దాటిన అనంతరం శ్రీ ఆది వర స్వామి కమాన్ ప్రాంతంలో ఒక కారు పొలాల్లోకి దూసుకెళ్లింది.పెద్దపల్లి నుంచి రామగిరి మండలం లద్నాపూర్ వెళ్తున్న కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో డ్రైవర్ ముడుసు సాగర్ మాత్రమే ఉండగా అతని తలకు గాయం కాగా 108 వాహనంలో ఆసుపత్రికి ఆస్పత్రికి తరలించారు.కాగా ఆ కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు.

# కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం

**-బాధ్యతతో పని చేస్తాం**
**-కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం**
**-వారంలో ఒక రోజు డివిజన్‌లో పర్యటిస్తా**
**-66వ డివిజన్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మేయర్ కోలగని శ్రీనివాస్ వ్యాఖ్యలు**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 18 :** బిజెపి పై నమ్మకంతో కరీంనగర్ నగరపాలక సంస్థ బాధ్యతలను అప్పజెప్పిన పట్టణ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కారాలు తెలియ జేస్తున్నామని,ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో పనిచేస్తామని,డివిజన్ సమస్యల పరిష్కారం కోసం వారంలో ఒక రోజు డివిజన్‌లో పర్యటిస్తనని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శ వంతంగా తీర్చిదిద్దుతామని మేయర్ కోలగని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ పట్టణం 66డివిజన్లో 13.5లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు, డ్రైనేజీ పనులను డిప్యూటీ మేయర్ సునీల్ రావు,కార్పొరేటర్ వంగల పవన్‌లతో కలిసి మేయర్ కోలగని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలు తమ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కుంటా మన్నారు.నగర అభివృద్ధి కోసం కరీంనగర్ పట్టణ ప్రముఖులు,ప్రజల సూచనలు, అభిప్రాయాలను,సలహాలను పరిగణలోకి తీసుకొని ముందుకు కొనసాగుతామని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసే ఆలోచనతో ఉన్నామని,గతం కంటే మెరుగైన స్థితిలో కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకు వెళ్లడానికి శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ప్రధానంగా నగరపాలక సంస్థలోని 66 డివిజన్లో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తామని,ప్రజలకు రోడ్లు, డ్రైనేజీల సమస్యలకు విముక్తి కల్పించే లక్ష్యంతో సంకల్పంతో ఉన్నామన్నారు.కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాలో నెలకొన్న సమస్యలపై ప్రధాన దృష్టి సారించి, సాధ్యమైనంతవరకు సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. చెత్త సేకరణ,పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా,రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ డివిజన్ కు తాగునీటి కొరత రాకుండా చూస్తామన్నారు.నగరపాలక సంస్థలో ప్రజలకు అవసరమయ్యే పనులు త్వరిత గతిన వేగంగా పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు వంగల పవన్, గుగ్గిలపు రమేష్,సోమిడి వేణు ప్రసాద్, బండ రమణారెడ్డి,కె పీ చంద్ర,శ్రీనివాస్, తాటి ప్రభావతి,కన్న కృష్ణ,బిజెపి మీడియా కన్వీనర్ కటకంలోకేష్,నాయకులు వరాల జ్యోతి,సురేష్,కొంపల్లి రామన్, శ్రీనివాస్,లడ్డు ముందడ,తనకు సాయి కృష్ణ, కైలాస నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డ్ మెంబర్‌ను సన్మానించిన రత్నాపూర్ సర్పంచ్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ భాస్కర్ల అరుణ ను బుధవారం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు సన్మానించారు.ఆమె రత్నాపూర్ గ్రామానికి రాగా శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భాద్రపు ప్రవళిక- ప్రశాంత్,వార్డ్ సభ్యులు పబ్బా స్రవంతివెంకటేష్, జక్కుల పద్మ చందన్, బత్తిని ప్రశాంత్,అల్లి రమేష్,పున్నశీ మణి తేజ,జుట్టు యశోద సత్యనారాయణ, బత్తుల రాజమణి రమేష్‌లు ఉన్నారు.

# వీధి రౌడీల్లా ప్రవర్తించడం సరికాదు

**-పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** చెన్నూర్ నియోజకవర్గం క్యాతన్‌పల్లిలో బాల్క సుమన్ మరియు బిఆర్ఎస్ నాయకులు రౌడీల్లా ప్రవర్తించారని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.దాడిలో తీవ్రంగా గాయ పడిన కానిస్టేబుల్ రాకేష్‌ను సికింద్రాబాద్‌లోని ఆపోలో ఆసుపత్రి సికింద్రాబాద్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరామర్శించారు.రాకేష్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అతని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అవసరమైన ఉత్తమ వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు.చట్టాన్ని కాపాడే పోలీసులపై దాడులు చేయడం తీవ్రమైన విషయం అని పేర్కొంటూ,బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గృహప్రవేశానికి ఇందిరమ్మ ఇల్లు రెడీ

**-స్లాబ్ లెవల్‌కు చేరిన ఏడు ఇందిరమ్మ ఇల్లు పరిశీలించిన ఎంపీడీవో సర్పంచ్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 18 :** ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామములో నిర్మిస్తున్న ఇందిరామ్మా ఇండ్లనుఎంపీడీఓ సత్తయ్య సర్పంచ్ సిర్రం నాగరాజు యాదవ్‌లు బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ హరిదాస్‌నగర్‌లో తొమ్మిది మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని అందులో మూడు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి రెడీగా ఉన్నాయని, మరో ఏడూ ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ లెవల్లో ఉన్నాయని చెప్పారు.త్వరగా పనులు పూర్తిచేయాలనీ లబ్దిదారులకు ఎంపీడీఓ సత్తయ్య సూచించారు.ఈ కార్యక్రమములో సెక్రెటరీ రమేష్ వార్డ్ మెంబెర్ ఉప్పుల ఎల్లారెడ్డి, బొల్లు రాజు, వెంకటరెడ్డి ,నారాయణ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకై చెట్ల కొమ్మల తొలగింపు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 18 :** ప్రమాదాల నివారణ కోసం ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్ ఎస్ఐ రాహుల్ రెడ్డి సూచనల మేరకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారి మధ్య గల డివైడర్ లో గ్రామపంచాయతీ పెంచిన చెట్లకు జిబ్బుగా పెరిగిన కొమ్మలను గ్రామ సర్పంచ్ ఎలగందుల నరసింహులు గ్రామ పంచాయితీ సిబ్బందితో బుధవారం తులగింప చేశారు.గొల్లపల్లి వైపు సాధు వెంకట్రెడ్డి ఐటిఐ వరకు ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారి లోని డివైడర్ లో పెంచిన చెట్ల కొమ్మలు జిబ్బుగా పెరగడంతో రోడ్డు మలుపుల వద్ద వచ్చిపోయే వాహనాలు వాహనదారులకు కనిపించడం పోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి, దీంతో గొల్లపల్లి ఎల్లారెడ్డిపేట మధ్య కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారి పై ఇటీవల నలుగురైదుగురు రోడ్డు ప్రమాదంలో మరణించారు, ఈ మరణాలను సీరియస్గా తీసుకొని సీఐ శ్రీనివాస్ గౌడ్ ఎస్ఐ రాహుల్ రెడ్డి ప్రమాదానికి కారణమవుతున్న జిబ్బుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని సర్పంచ్ ఎలగందుల నరసింహులు తో చర్చించారు.చర్చల అనంతరం వెంటనే స్పందించిన ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు గ్రామపంచాయతీ సిబ్బంది చేత సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారిపై పెంచిన చెట్లకు జిబ్బుగా పెరిగిన చెట్ల కొమ్మలను బుధవారం తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రమాదాల నివారణకు చెట్ల కొమ్మలను తొలగింపజేసినందుకు వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో

# కరీంనగర్ జిల్లా "భవిత" విద్యార్థుల ప్రతిభ




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 18 :** పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగ క్రీడా పోటీల్లో కరీంనగర్ జిల్లాలోని భవిత కేంద్రాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లాలోని చిగురుమామిడి, తిమ్మాపూర్, కరీంనగర్ రూరల్ భవిత కేంద్రాల్లో చదువుతున్న దివ్యాంగవిద్యార్థులు అండర్ 14, అండర్ 17 రన్నింగ్ పోటీల్లో విజయం సాధించారు.చిగురుమామిడి భవిత కేంద్రానికి చెందిన రెంటాల సాత్విక్ రెడ్డి అండర్ 14 మానసిక దివ్యాంగుల రన్నింగ్ విభాగంలో మూడో బహుమతి సాధించాడు. తిమ్మాపూర్ మండలం మోహమ్మద్ అమన్ ఖాన్ అండర్ 14 బధిరుల విభాగంలో రెండవ బహుమతి కైవసం చేసుకున్నాడు. కరీంనగర్ రూరల్ మండలం ఏలూరి పవన్ సాయి అండర్ 14 మానసిక దివ్యాంగుల విభాగం 50 మీటర్ల పరుగు పందెంలో మూడవ బహుమతి సాధించారు.

**కలెక్టర్, డీఈవో అభినందన**

రాష్ట్ర స్థాయి దివ్యాంగ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,అడిషనల్ కలెక్టర్,జిల్లా విద్యాఅధికారి అభినందించారు.విద్యార్థులను పోటీలకు సిద్ధం చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు, ప్రోత్సాహం,సమగ్ర వేదికలు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.పోటీలకు విద్యార్థులను తీసుకెళ్లిన వారిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు, ఐ.ఈ.ఆర్.పి.ఎస్ రాపర్తి గణేష్, శ్రీలత, తిరుపతి, తల్లిదండ్రులు ఉన్నారు.

# మాధకద్రవ్యాల నిర్మూలన సమిష్టి బాధ్యత

**-జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 18 :** మాధకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అధికారులతో పాటు ఉపాధ్యాయులు, యువత, తల్లిదండ్రులు సమిష్టిగా మత్తు పదార్థాల నిర్మూలనకు సహకరించాలని కోరారు.జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్,ఎక్సైజ్, మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో మాధకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు జిల్లాలో సత్ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. పోలీస్,ఎక్సైజ్ అధికారులు సమన్వయం తో డ్రగ్స్ మూలాలను పెకిలించి వేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ మెడికల్ స్టోర్స్ లో అమ్మకాలను పరిశీలించాలని డ్రగ్ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. వైద్యుల చీటీ లేకుండా మత్తు కలిగించే మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలలను సందర్శించి కేవలం డ్రగ్స్ పైనే కాకుండా మద్యపానం, ధూమపానం అనర్థాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. జిల్లాలో అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, అమ్మకం తదితర అంశాల్లో జనవరి 2025 నుండి జిల్లాలో ఇప్పటివరకు 37 కేసులు నమోదు చేశామని అన్నారు. 87 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. జిల్లాలో 42 కిలోల 225 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. డాగ్ స్క్వాడ్ ద్వారా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే డ్రగ్స్ డిటక్షన్ కిట్ల ద్వారా తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగంపై ఉక్కు పాదం మోపుతామని అన్నారు. డ్రగ్స్ అమ్మకాలు, వినియోగం, రవాణా వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని,ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని రామగిరి మండలం కాలనీ రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, సేవా అధ్యక్షురాలు తిరుమల మధుసూదన్ అన్నారు.బుధవారం రత్నాపూర్ గ్రామం లో జ్యూట్ బ్యాగ్ శిక్షణా తరగతులను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, సేవా అధ్యక్షురాలు తిరుమల మధుసూదన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం సింగరేణి సేవా సమితి ఎన్నో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసమే జ్యూట్ బ్యాగుల తయారీ అని, కావున ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని, నైపుణ్యాన్ని సంపాదించి, ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకోవాలని అన్నారు.గతంలో శిక్షణ పొందిన చాలా మంది మహిళలు, ప్రస్తుతం స్వయం ఉపాధి పొందుతూ,ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమం లో రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ, సినియర్ పర్సనల్ ఆఫీసర్ పి.రాజేశం, సేవా కార్యదర్శి ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి అరుణ,సేవా సభ్యులు,శిక్షకులు,అభ్యర్థులు పాల్గొన్నారు.

## ప్రధాని విశ్వకర్మ యోజనపై అవగాహన




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (మంచిర్యాల జిల్లా)ఫిబ్రవరి 18 :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రధాని విశ్వకర్మ యోజనపై అవగాహన సమా వేశం నిర్వహించారు.సంప్రదాయ వృత్తు ల అభివృద్ధి,స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా నిర్వహించిన కార్యక్ర మానికి వివిధ శాఖల అధికారులు, కార్మికులు హాజరయ్యారు.కార్యక్రమంలో అధికారులు పథకం ముఖ్యాంశాలను వివరించారు.అర్హులైన లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ,ఆధునిక పరికరాలు, ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు.గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ పథకం దోహద పడుతుందని పేర్కొన్నారు. వృత్తిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లికు చెందిన ఎన్‌జీఓ నిర్వాహకుడు తాజ్ సమన్వయం చేశారు. హాజరైన అధికారులు దశరథ్ ఎం ఎస్ ఎం ఈ డి ఎఫ్ ఓ టీమ్ రాజేందర్ ఎన్ ఎస్ డి సి ప్రతినిధి తిరుపతి ఎల్ డి ఎం శ్రీనివాస్ రెడ్డి జిఎండిఐసి.తాజ్ -- నిర్వాహకుడు, ఎన్‌జీఓ, పెద్దపల్లిఇతర శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసినికి సన్మానం

**-సన్మానించిన కరాటే రమేష్ దంపతులు**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఫిబ్రవరి 18 :** హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిలర్‌గా30వవార్డునుండి గెలుపొంది తదనంతరం చైర్ పర్సన్‌గా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన రొంటాల సుహాసినిని బుధవారం కరాటే ఇన్స్ట్రక్టర్ ఐ రమేష్ కుమార్ ఆరోగ్యశాఖ ఉద్యోగి శ్రీదేవి దంపతులు సన్మానించారు.వార్డు సందర్శనలో భాగంగా ఆమె రమేష్ నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా రమేష్ దంపతులు ఆమెను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. హుజురాబాద్ ను అన్ని రంగాల్లో కొత్త మున్సిపల్ కార్యవర్గం ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. పట్టణంలో కోతుల, కుక్కల బెడద వీలైనంత తొందరగా నివారించాలని కోరారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ సుహాసిని మాట్లాడుతూ రమేష్ కుటుంబంతో తమకు ఎంతో అనుబంధం ఉందని హుజురాబాద్ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారానికి కృషి చేస్తామని,ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.



## రైతులకు రెవెన్యూ గ్రామాల వారిగా యూరియా పంపిణీ చేయాలి

**-ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి**

**చురకలు విలేఖరి వీణవంక ఫిబ్రవరి 18 :** వీణవంక మండలంలోనీ రైతులకు మండలం యూనిట్ గా రైతు యాప్ వల్ల రైతులకు ఆన్ లైన్ ఇబ్బందుల వల్ల రైతులకు యూరియా దొరకటం లేదనీ ఘన్ముక్ల మాజీ ఎంపిటిసి,ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు ఓ ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం నూతనంగా యూరియా బస్తాల కోసం యాప్ ద్వారా ఆన్ లైన్ చేసుకుంటేనే యూరియా రైతులకు ఇస్తామని మండలం యూనిట్ గా పెట్టటం తొ ఆన్ లైన్ ఇబ్బందులు వల్ల బుకింగ్ కాక రైతులు అవస్థలు పడుతున్నారు.450బస్తాలుఆన్ లైన్ లో పెట్టిన ఒక నిమిషం లోపే యూరియా బుకింగ్ అయ్యి రైతులకు యూరియా దొరకటం లేదు.మండలంలో26గ్రామాల రైతులు ఫోన్లతో ఆన్లైన్ చేయటం వల్ల యూరియా నిల్వ లేనట్లు చూపిస్తుంది.దీనివల్ల యూరియా సమయానికి దోరకక రైతులు రోడ్డు ఎక్కే పరిస్థితి దాపురించింది. వెంటనే వీణవంక మండలంలో యూరియా ఆన్లైన్ యాప్ ను రైతు క్లస్టర్ వారిగా నమోదుకు అవకాశం కల్పిస్తే 3,4గ్రామాలు కాబట్టి రైతులకు అన్లైన్‌బుక్ అయ్యి యూరియా దొరుకుతుంది. రైతుల బాధను అర్థం చేసుకొని జిల్లా కలెక్టర్,అధికార యంత్రాంగం, వ్యవసాయాధికారులు స్పందించి రైతు వేదిక క్లస్టర్ యూనిట్ లేదా రెవెన్యూ గ్రామాల వారిగా ఆన్ లైన్ రైతు యాప్ సవరించింతే యూరియా సులభంగా దొరుకుతుందని వెంటనే యాప్ మార్పిడి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కొరకు కౌన్సిలింగ్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** రామగిరి మండలం సెంటినరీకాలనీ రామగుండం-3 ఏరియా జనరల్‌మేనేజర్ సుంకర మధుసూదన్ ఆదేశాల మేరకు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు బుధవారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. మొత్తము 186 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 61 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 15 మంది ఉద్యోగులు హాజరై, 13 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటుజియం యం.రామ్మోహన్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు గంగాధర్, టి.మల్లిక ఇంచార్జ్ పర్సనల్ విభాగాధిపతి వి.సునీల్ ప్రసాద్, సివిల్ విభాగం అధికారి దుర్గం శ్రీనివాస్, ఎస్టేట్స్ విభాగం అధికారి మణిదీప్ రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య రెడ్డి, దాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై సర్పంచ్ దృష్టి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పై సర్పంచ్ రంగు సత్యనారాయణగౌడ్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు.మండల కేంద్రంలో గత చాలా రోజులుగా పాలకవర్గం లేకపోవడంతో చెత్తాచెదారం చాలా చోట్ల దర్శనం ఇచ్చింది.దీంతో రెండో వార్డ్ సభ్యుడు గుంజపడుగు నవీన్ ఆధ్వర్యంలో రెండో వార్డులోని కాలువ లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్త తదితర వాటిని జెసిబి ద్వారా తొలగించారు.చెత్తాచెదారం తొలగింపజేసిన సర్పంచ్ నారాయణ గౌడ్‌కు వార్డు సభ్యుడు గుంజపడుగు నవీన్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్టీఐ క్యాంపెయిన్ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

**-సమాచార హక్కు చట్టం అమలులో వైఫల్యాలను పరిష్కరించాలని ఆర్టీఐ ఫోరం వినతి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి )ఫిబ్రవరి 18 :** యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ తెలంగాణ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాస రావు, దేశాల భూపాల్,మోహసిన ఫర్వీన్,బైరెడ్డి అయోధ్య రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.బుధవారం గోదావరిఖని లోని సింగరేణి ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో ఈ కార్యక్రమం జరిగింది.స్టేట్ కో కన్వీనర్ సోమ వెంకటేశ్వర్లు,మహిళా స్టేట్ కో-కన్వీనర్ ఎస్ లక్ష్మిల ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం పెద్దపల్లి జిల్లా, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో సమాచార హక్కు చట్టం 2005 అమలు తీరులో ఎదురవుతున్న తీవ్ర ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సమాచార కమిషనర్లకు వారు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల వివరాల బోర్డులు లేకపోవడం,30రోజుల గడువులోగా సమాచారం ఇవ్వక పోవడం,అప్పీళ్లు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం వంటి సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని,రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని,సెక్షన్ 4 కింద స్వచ్ఛంద ప్రకటనలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జంగచక్రధర్ రెడ్డి, కో కన్వీనర్ ఆరెల్లి మల్లేష్, ఎం.రాజేశం, ఎస్.నాగేశ్వర్,జి.సురేష్, ఎండి.తాజుద్దీన్ బాబా,జి. చిరంజీవి, జి. చంద్రమౌళి, పి. రాజ్ కుమార్, ఓల్లే తిరుపతి కె. గుణకరం తదితరులున్నారు.

# గ్రామ అభివృద్ధి చెందాలంటే పాలకవర్గం కీలక పాత్ర

**-ఎంపీడీవో తిరుపతి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (అంతర్గాం) ఫిబ్రవరి 18 :** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పాలకవర్గం కీలక పాత్ర వహించాలి అని అంతర్గాం ఎంపీడీవో పెద్దపల్లి జిల్లా అంతర్గాం గంభీరావుపేట తిరుపతి అన్నారు. అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పాలకవర్గానికి అంతర్గాం ఎంపీడీఓ గాంభీరావుపేట తిరుపతి శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో తిరుపతి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామ పాలకవర్గం ఎప్పటికప్పుడు గ్రామ సమస్యలను తెలుసుకుంటూ సమస్యల ను పరిష్కరించాలని, గ్రామ పాలక వర్గ సభ్యులకు పరిపాలనపై అవగాహన చేస్తూ, వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పిస్తూ. అందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్న నాడే గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీకి ప్రభుత్వము నుండి వచ్చే నిధులను దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధికి వినియోగించు కోవాలని, గ్రామంలో ఏదైనా సమస్య ఉన్నచో వార్డు సభ్యులు ఉప సర్పంచ్ లు కీలకపాత్ర వహించాలి. ఉదాహరణ కు గ్రామంలో ఉన్నటువంటి సమస్యలు త్రాగునీరు,డ్రైనేజీ సమస్య, వీధుల వెంబడి చెత్త,చెదారం లాంటి సమస్యను ప్రతిరోజు క్రమం తప్పకుండా మరమ్మత్తులు చేపించాలని అలా జరిగినప్పుడే గ్రామం సశశ్యామలంగా, గ్రామంలోని ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతారని అలాంటప్పుడే మన గ్రామ పంచాయతీ అభివృద్ధి చెందినట్టుగా మనం గ్రహించాలని మండలంలోని పాలకవర్గ సభ్యులకు మండల ప్రజా పరిషత్ అధికారి గాంభీరావుపేట తిరుపతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, ఎంపీఓ బైరి వేణుమాధవ్, పర్యవేక్షకులు మామిడాల కర్ణాకర్, శిక్షణ నిర్వహకులు ఎన్. రాజిరెడ్డి, కె. రమేష్,సాగర్ రావు, ప్రసాద్, మోహన్,వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల పాలకవర్గ సభ్యులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామి ఆలయ సమీపంలోని

# మంచినీటి సేద బావిలో పడి వ్యక్తి ఆత్మహత్య

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 18 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పందిళ్ళ సురేష్ గౌడ్(49 ) అనే వ్యక్తి మంచినీటి సేదబావిలో పడి మరణించినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం మంగళవారం కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో గల సేద బావిలో సురేష్ గౌడ్ అనే వ్యక్తి దూకి బలవన్మరణం చెందాడు.మాచారెడ్డి ఎస్ఐ అనిల్ కుమార్ ఆలయం వద్ద ఉన్న సిసి



కెమెరా పుటేజీలను పరిశీలించారు, మృతుడు సురేష్ గౌడ్ ఆలయం సమీపంలోని మంచినీటి సేదా బావి చుట్టూ ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన ఇనుప జాలిని ధ్వంసం చేసి బావిలో దూకి మరణించినట్లు సిసి కెమారా ఫుటేజీల ఆధారాలను పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు, ఘటనా స్థలానికి గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ జర్నలిస్టు పందిల్ల రవికాంత్ గౌడ్ లు బుధవారం వెళ్లి జరిగిన సంఘటన తెలుసుకొని మహారాష్ట్ర ముధోల్ ప్రాంతంలో నివాసమై ఉంటున్న మృతుని బంధువులకు సమాచారం అందించారు, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు మృతదేహాన్ని పోస్ట్మార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు, పోస్టుమార్టం అనంతరం గొల్లపల్లి సర్పంచ్ రమేష్ గౌడు మృతదేహాన్ని మహారాష్ట్ర ముధోల్ ఏరియాకు అతను బంధువుల ద్వారా తరలించారు,

# జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 18 :** జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది.జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ సమావేశానికి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నదులపై చెక్ డ్యాములు నిర్మించినచోట భద్రత దృశ్య డ్యాముకు ఎగువన,దిగువన 300మీటర్ల వరకు ఇసుక తోడడం నిషేధమని, అధికారులు ఎప్పటికప్పుడు ఈ అంశాన్ని పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలోని నదీ ప్రవాహాలకు సంబంధించి సరిహద్దులను పక్కాగా గుర్తించాలని,రికార్డు చేయాలని సూచించారు.ఇరిగేషన్, రెవిన్యూ, ఆర్.డబ్ల్యూ.ఎస్,టిజీఎండిసి,పోలీస్ అధికారులు సమన్వయంతో ఇసుక రీచ్ లను తనిఖీ చేయాలని అన్నారు.మన ఇసుక వాహనం ఆన్లైన్ పోర్టల్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక కేటాయింపు పై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రౌండ్ వాటర్ డిడి శ్యాంప్రసాద్ నాయక్,డిపిఓ జగదీశ్వర్,జిల్లా జియాలజిస్ట్ ప్రసన్న,డిఈఈ రాజేందర్, డిప్యూటీ డిఈ వేణుగోపాల్,మైండ్స్ ఏడి రాఘవరెడ్డి,టీజీఎండిసి పిడి శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ రవి,ఆర్ఓ కనుక జ్యోతి పాల్గొన్నారు.

## ఘనంగా వీడ్కోలు సమావేశం




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 18 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని రాచర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల విడుకోలు సమవేశం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని,విద్యార్థులునృత్యలుచేసిపండుగ వాతావరణంను తలపించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా కళాశాల డైరెక్టర్స్ అయిత వెంకటేశ్వర్లు ,చేపూరి జయలక్ష్మి శ్రీనివాస్,మాజీ జెడ్పిటిసి సభ్యులు ఏలూరి రాజయ్య ,చేపూరి జయశ్రీ ,చీకోటి స్వప్న,తంగాడా శ్యాంసుందర్ రావు మాధవిలత విచ్చేసి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, మంచి ఫలితాలు సాధించాలని ఉదాహరనలతో మెలుకువలు నింపాపరు,తర్వాత విద్యసంవత్సరంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందించారు.ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొత్తపల్లి చిరంజీవి గారు, అధ్యాపక అధ్యాపకేతర బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేశారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ ప్రారంభ శుభాకాంక్షలు

**-రాష్ట్ర మంత్రి దుదెళ్ల శ్రీధర్ బాబు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 18 :** ముస్లిం సోదరులకు రంజాన్ మాసపు ప్రారంభ శుభాకాంక్షలు అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం నుండి ముస్లిం ల పవిత్ర మాసమైన రంజాన్ ప్రారంభం సందర్భంగా ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.ముస్లిం సోదరులు ప్రశాంతమైన వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పవిత్ర మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ముస్లిం సోదర సోదరీమణులు అత్యంత పవిత్రంగా ఉపవాస దీక్ష ప్రారంభిస్తారని,ప్రశాంతమైన వాతావరణంలో వారి దీక్షలు కొనసాగి ఎలాంటి ఆటంకం కలగకుండా ఆ అల్లా దయతో అందరు బాగుండాలని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు.మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.